RNI: TELTEL12215
https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu


# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## ప్రొపల్షన్ మాడ్యూల్ ని విజయవంతంగా మళ్లీ భూ కక్ష్యలోకి..

### ఇస్రోకి అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు:** చంద్రుడి దక్షిణ ధ్రువంపై పరిశోధనలే ధ్యేయంగా భారత్ ప్రవేశపెట్టిన చంద్రయాన్ ? 3 విషయంలో ఇస్రో మరో రికార్డు క్రియేట్ చేసింది. చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ప్రొపల్షన్ మాడ్యూల్ ని విజయవంతంగా మళ్లీ భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. అయితే ఈ ప్రయోగాన్ని మొదట అనుకోలేదని ఇస్రో సైంట ిస్టులు తెలిపారు. చంద్రుడి ఉపరి తలంపై



ప్రయోగాలకోసం పంపిన ఈ మూన్ మిషన్ తాజా .

మిగతా 3లో

RANGAREDDY, EDITION : 01, VOLUME :203 EDITOR: CHERUKU UPENDAR, DATE : FRIDAY 08 DECEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 203 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 08 డిసెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

# ప్రజా సేవకులం..!

## ప్రమాణ స్వీకారోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్






- సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణం - డిప్యూటీగా భట్టి విక్రమార్క
- ప్రగతిభవన్ ఇక నుంచి జ్యోతిరావు పూలే ప్రజాభవన్
- ప్రజలిచ్చిన అవకాశాన్ని గౌరవంగా, బాధ్యతగా భావిస్తాం..
- ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలందరికీ స్వేచ్ఛ..
- అభివృద్ధిని రాష్ట్రమంతటా విస్తరిస్తాం
- రైతులు, నిరుద్యోగులు, ఉద్యమకారులకు న్యాయం
- గ్యారెంటీల అమలు ఫైలుపై తొలి సంతకం..
- దివ్యాంగురాలు కుమ్మరి రజినికి నియామక పత్రం



ఎన్నో పోరాటాలు, త్యాగాలతో, ఎన్నో ఆలోచనలు, ఆకాంక్షల మధ్య ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం దశాబ్దకాలంగా హత్యకు గురైందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మానవ హక్కులకు భంగం కలిగిందని, ప్రజలకు తమ బాధలు చెప్పుకునే అవకాశమే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి బాధలు వినే ఉద్దేశం ప్రభుత్వం తరుపున ఎవరికీ లేకపోవడంతో దశాబ్దకాలంగా తెలంగాణ ప్రజానీకం మౌనం వహించిందన్నారు. ఈ నేపథ్యంలోనే నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలు, రైతాంగం, విద్యార్థులు, నిరుద్యోగ యువతీ యువకులు, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల ఆకాంక్షలను నెరవేర్చటానికి రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందని రేవంత్ ప్రకటించారు. ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటుతో రాష్ట్రంలో ప్రజలకు స్వేచ్ఛ లభించిందన్నారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రివర్గం తెలంగాణ ప్రజలకు సామాజిక న్యాయం కలుగజేసే బాధ్యతను తీసుకుంటుందన్నారు. తెలంగాణ నలుమూలలా సమానమైన అభివృద్ధి జరుగుతుందని భరోసా ఇచ్చారు. తాము పాలకులం కాదని, ప్రజల సేవకులమని ప్రకటించారు. ప్రజలకు సేవ చేయడానికి వచ్చిన అవకాశాన్ని గౌరవంగా భావిస్తామని, బాధ్యతగా తీసుకుంటామని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తామని రేవంత్ చెప్పారు. ముఖ్యమంత్రిగా ప్రమాణం అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ అతిరథ మహారథులు మల్లికార్జున ఖర్గే, సోనియ గాంధీ, రాహుల్, ప్రియాంక తదితరుల సమక్షంలో అంగరంగవైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ రేవంత్‌తో సీఎంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనతోపాటు మల్లు భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా, మరో పది మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరిందనీ, ప్రతి ఒక్కరి ఆకాంక్షలను నెరవేరుస్తామని ఈ సందర్భంగా రేవంత్ హామీనిచ్చారు.

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణ ఏర్పడిన పదేండ్ల తర్వాత తొలిసారిగా కాంగ్రెస్ నేతృత్వంలో కొత్త సర్కార్ కొలువుదీరింది. ఆ ప్రభుత్వానికి ఎనుముల రేవంత్‌రెడ్డి సారధిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో మేము పాలకులం కాదు.. మీ సేవకులం అంటూ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రజలు అవకాశమివ్వడాన్ని తాను గొప్ప గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆసిఫాబాద్ నుంచి అలంపూర్ వరకు, ఖమ్మం నుంచి కొడంగల్ వరకు సమానాభివృద్ధి కోసం, నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం, సామాజిక న్యాయాన్ని సాధించాలనే లక్ష్యంతో సోనియాగాంధీ ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆయనతో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతోపాటు డిప్యూటీ సీఎంగా మల్లు భట్టి విక్రమార్క, మంత్రులుగా ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎంపీలు, పలువురు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మహోత్తర ప్రయత్నం జరిగిందన్నారు. ఎన్నో పోరాటాల తర్వాత రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణ త్యాగాల పునాదులపై నిర్మించబడిందని తెలిపారు. నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల ఆకాంక్షలను నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో గత పదేండ్లుగా ప్రజాస్వామ్యం నిర్వీర్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని




చెప్పారు. తమ సమస్యలను గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే వేదిక లేకపోవడంతో ప్రజలు మౌనంగా ఉన్నారని తెలిపారు. కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన కాంగ్రెస్ కార్యకర్తల మద్దతుతో 'ప్రజా తెలంగాణ ప్రభుత్వం' ఏర్పడిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు ప్రక్రియతో తెలంగాణ ప్రజలు స్వాతంత్ర్యం పొందారని ప్రకటించారు. తమ రాష్ట్ర మంత్రివర్గం తెలంగాణ ప్రజలకు న్యాయం చేస్తుందన్నారు. కొత్త ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో సమానాభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ప్రగతి భవన్ చుట్టూ ఉన్న ఇనుప కంచెలను బద్దలు కొట్టి ప్రగతి భవన్‌లోకి స్వేచ్ఛగా ప్రజలకు ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ ఆలోచనలు, ఆకాంక్షలు, వారి ఆలోచనలను ప్రభుత్వంతో పంచుకునేందుకు స్వాగతం పలుకుతున్నట్టు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అందరి సలహాలు తీసుకుని సంక్షేమ రాజ్యాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానన్నారు.

### నేటి నుంచి ప్రజాదర్బార్

ప్రజలకు అందుబాటులో లేని ప్రగతిభవన్ పేరును శు క్రవారం నుంచి జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా మార్చుతున్నట్టు సీఎం రేవంత్ ప్రకటించారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు. ప్రజల హక్కులను కాపాడే బాధ్యతను తానే తీసుకుంటానన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి, శాంతి భద్రతలు పరిరక్షించేందుకు ప్రాధాన్యతనిస్తానని హామీ ఇచ్చారు. భారతదేశం మాత్రమే కాకుండా ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. నిస్సహాయులను నిర్లక్ష్యం చేయరాదనే విశ్వాసాన్ని కలిగిస్తానని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గేల స్ఫూర్తితో కొత్త ప్రభుత్వం ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ జెండాను వదులుకునేందుకు కార్యకర్తలేవరూ సిద్ధంగా లేరనీ, అందుకే కష్టపడి కొత్త ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని తెలిపారు. 'మీ కష్టాన్ని గుర్తుంచుకుంటాను. మీ అందరినీ నా హృదయంలో ఉంచుకుంటాను.
పదేండ్లు కష్టపడి పని చేసిన .

మిగతా 2లో



## ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్.. వేదిక ప్రజా భవన్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. సీఎంగా రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎంగా మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం చేస్తూ రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ప్రగతి భవన్ ఇనుప కంచెలు బద్దలు కొట్టామని.. శుక్రవారం ఉదయం 10 గంటలకు అక్కడ ప్రజా దర్బార్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రగతి భవన్ పేరుని జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌గా మారుస్తున్నట్లు ప్రకటించారు. ఇకపై ప్రజా భవన్‌కు ఎవరైనా రావొచ్చు అని.. ఎలాంటి ఆంక్షలు ఉండవని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ లభించిందని, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకే ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటుతో సమాన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు రేవంత్ రెడ్డి. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాదని, ప్రపంచంతోనే పోటీపడేలా చేస్తానన్నారు. కాగా ప్రజా దర్బార్ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ప్రజా దర్బార్ ద్వారా ప్రజల ఫిర్యాదులను స్వీకరించి వెంటనే పరిష్కరించేలా సీఎం రేవంత్ చర్యలు చేపట్టనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

### మంత్రులతో తొలిసారి సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం

తెలంగాణ రెండో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. కొన్ని గంటల ముందే కాంగ్రెస్ ప్రభుత్వం కొలువదీరింది. రేవంత్‌తో సహా 11 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇదిలా ఉంటే ఈ సాయంత్రమే ముఖ్యమంత్రి హెూదాలో రేవంత్‌రెడ్డి సచివాలయంలోకి అడుగుపెట్టనున్నారు. అనంతరం కొత్త మంత్రులతో 5 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీలపై తొలి సంతకం చేసిన నేపథ్యంలో వీటి అమలుపై మంత్రులతో చర్చించనున్నట్లు తెలుస్తోంది. పథకాల అమలు, ప్రభుత్వాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలన్న అంశాలపై మంత్రివర్గంతో చర్చించనున్నారు.

## మంత్రులకు శాఖలు ఖరారు

**ఉత్తమ్-హెూంశాఖ**

**దామోదర రాజనర్సింహ- వైద్య ఆరోగ్య శాఖ**

**భట్టి విక్రమార్క- రెవెన్యూ**

**కోమటిరెడ్డి-మున్సిపల్**

**తుమ్మల-రోడ్డు, భవనాల శాఖ**

**పొంగులేటి-ఇరిగేషన్**

**శ్రీధర్‌బాబు-ఆర్థిక శాఖ**

**సీతక్క-గిరిజన సంక్షేమ శాఖ**

**జూపల్లి-సివిల్ సప్లై**

**పొన్నం-బీసీ సంక్షేమశాఖ**

**కొండా సురేఖ- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ**

## రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్‌గా శివధర్‌రెడ్డి నియామకం

**- త్వరలోనే మరికొందరు ఐపీఎస్‌ల బదిలీలు**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



రాష్ట్ర పోలీసు శాఖలో అత్యంత కీలకమైన ఇంటెలిజెన్స్ చీఫ్‌గా అదనపు డీజీ శివధర్‌రెడ్డిని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వెంటనే శివధర్‌రెడ్డిని ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించుకుంటూ ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర రైల్వే పోలీసు, రోడ్ సేఫ్టీ విభాగానికి అదనపు డీజీగా శివధర్‌రెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ఇంటెలిజెన్స్ చీఫ్ బాధ్యతలను శివధర్‌రెడ్డి స్వీకరించారు. 1994 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన శివధర్‌రెడ్డి.. నగర సౌత్ జోన్ డీసీపీగా, నల్గొండ ఎస్పీగా, శ్రీకాకుళం ఎస్పీగా, యాంటీ నక్సలైట్ నిఘా విభాగం (ఎస్ఐబీ) డీఐజీగా, వైజాగ్ కమిషనర్‌గా పని చేసిన ఆయన సమర్థుడైన ఐపీఎస్ అధికారిగా పేరు పొందారు. ముఖ్యంగా, తెలంగాణ నూతన రాష్ట్రం ఏర్పడగానే కేసీఆర్ ఆయనను తన ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా కీలకమైన బాధ్యతలను అప్పగించారు. కాగా, రెండున్నరేండ్లకే శివధర్‌రెడ్డిని హఠాత్తుగా పదవి నుంచి నుంచి తప్పించిన కేసీఆర్.. లూప్‌లైన్‌లోకి మార్చారు. తాజాగా, రేవంత్‌రెడ్డి.. శివధర్‌రెడ్డి సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే ఆయనకు ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పోస్టింగ్ ఇచ్చినట్టు సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించటంతో పాటు రాజకీయ ప్రత్యర్థుల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు పసిగట్టి ముఖ్యమంత్రికి రెండు కండ్లుగా ఇంటెలిజెన్స్ చీఫ్ వ్యవహరిస్తారనే భావన పోలీసు శాఖలో ఉన్నది. దీంతోపాటు త్వరలోనే ఇంటెలిజెన్స్ చీఫ్ ఇచ్చే నివేదిక ఆధారంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లతో పాటు మరికొన్ని కీలకమైన పోలీసు విభాగాల అధిపతులను ముఖ్యమంత్రి బదిలీ చేసే అవకాశమున్నదనే ఊహాగానాలు పోలీసు శాఖలో సాగుతున్నాయి.

# ప్రజా సేవకులం





(మొదటిపేజీ తరువాయి)

కార్యకర్తలను ఆదుకునే బాధ్యతను నాయకుడిగా తీసుకుంటాను. రాహుల్, ప్రియాంక ఢిల్లీలో మమ్మల్ని కుటుంబ సభ్యులుగా పరిగణిస్తారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం మన విద్యార్థులు, నిరుద్యోగులు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పని చేస్తుంది' అని తెలిపారు.

### ఎన్నికల హామీలకు భరోసా

ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించిన ఫైలుపై సీఎం రేవంత్‌రెడ్డి తొలి సంతకం చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగి తుమ్మరి రజినీకి ఉద్యోగం మంజూరు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి రెండో ఫైలుపై సంతకం చేశారు. వేదికపైన్నే రజినీకి ఉద్యోగ నియామకపత్రాన్ని అందజేశారు. ఇప్పటివరకూ రేవంత్‌రెడ్డి మంత్రి కాకుండానే ముఖ్యమంత్రి అయ్యారు. జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ పదవులను ఆయన ఇప్పటివరకు నిర్వర్తించారు. డిప్యూటీ స్పీకర్‌గా పని చేసిన మల్లు భట్టి విక్రమార్క ఏకంగా డిప్యూటీ ముఖ్యమంత్రి పదవిని చేట్టారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క మొదటిసారి మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. రేవంత్, సీతక్క ప్రమాణం చేస్తున్న సందర్భంగా ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది.వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రేవంత్, ఉత్తమ్, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు తదితరులు 'దైవసాక్షిగా' ప్రమాణ స్వీకారం చేయగా, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క 'పవిత్ర హృదయం'తో ప్రమాణం చేశారు. వీరంతా తెలుగులో ప్రమాణం చేయగా, దామోదర రాజనర్సింహ ఇంగ్లీష్‌లో ప్రమాణం చేశారు.

### సోనియా, ఖర్గే, రాహుల్, ప్రియాంక హాజరు

ఘనంగా, ఉత్సహంగా, అట్టహాసంగా నిర్వహించిన ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్, ప్రియాంక గాంధీలతోపాటు పలువురు అగ్రనేతలు హాజరయ్యారు. హిమచల్‌ప్రదేశ్, కర్నాటక ముఖ్యమంత్రులు సుఖేందర్‌సింగ్, సిద్ద రామయ్య, కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్,వివిధ రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు, మంత్రులు, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ.రాజా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు హాజరయ్యారు. రేవంత్ దంపతులను సోనియాగాంధీ ఆశీర్వదించారు. రేవంత్ ప్రమాణస్వీకారం అనంతరం పలువురు నేతలు ఆయనకు అభినందనలు తెలిపారు

## రజనీకి కాంట్రాక్టు ఉద్యోగం ఉత్తర్వులు జారీ



వికలాంగురాలైన తుమ్మరి రజనీకి ఉద్యోగం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌కు చెందిన రజనీ ఎన్నికలకు ముందు గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డిని కలిసి తనకు ఎవరూ ఉద్యోగం ఇవ్వడం లేదని గోడు వెళ్ల బోసుకున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తొలి ఉద్యోగం ఇస్తానని రేవంత్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రజనీకి ఉద్యోగం కల్పించారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ కార్యదర్శి ఎం.రఘు నందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. తుమరి రజనీకి తెలంగాణ స్టేట్ సీడ్ అండ్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఏజెన్సీ (టీఎస్ఎస్ఒసీఏ)లో ప్రాజెక్ట్ మేనేజర్‌గా కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమిం చినట్టు తెలిపారు. ఆమెకు నెలకు రూ.50వేల పారితోషకాన్ని చెల్లించినున్నారు.

# 9 నుంచే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం


- ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 10 లక్షలకు పెంపు కూడా
- సోనియా జన్మదిన కానుకగా రెండు గ్యారంటీల అమలు
- క్యాబినెట్ వివరాలను వెల్లడించిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




సోనియా గాంధీ జన్మదినమైన శనివారం (9వ తేది) రాష్ట్ర శాశనసభ సమావేశాన్ని ప్రారంభిస్తున్నాం. అదే రోజు నుంచి మేమిచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండింటి అమలుకు శ్రీకారం చుడతాం .. ప్రజలు మాపై నమ్మకంతో అధికారాన్ని కట్ట బెట్టారు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అన్ని హామీలను దశల వారీగా అమలు చేస్తాం" అని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం సాయంత్రం సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలను సహచర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు హామీలను శనివారం నుంచి అమలు చేయనున్నట్టు తెలిపారు. ఈ రెండు గ్యారంటీలపై ఆయా శాఖల అధికారులతో సీఎం చర్చించి అమలుపై కార్యచరణను సిద్దం చేస్తారని తెలిపారు. 2014 నుంచి 2023 డిసెంబర్ వరకు ఏయే శాఖలో ఎన్ని నిధులు ఖర్చు పెట్టారు, వాటి ప్రయోజనాలు ప్రజలకు ఎంతవరకు చేరాయన్న సమాచారంతో కూడిన శ్వేతపత్రం విడుదల చేయనున్నట్టు వివరించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించాలని అధికారులను ఆదేశించినట్టు వెల్లడించారు. గత తొమ్మిదేండ్లుగా విద్యుత్‌కు సంబంధించి తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల సంస్థకు తీవ్ర నష్టం జరిగిందని, దానిపై శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులతో సీఎం సమీక్షించనున్నట్టు తెలిపారు. మహిళలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌పై కూడా క్యాబినెట్‌లో చర్చించినట్టు తెలిపారు. శనివారం నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో మొదట ప్రొటెం స్పీకర్ నియామకం, ఆ తర్వాత ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. అనంతరం గవర్నర్ ప్రసంగం ఉంటుందని తెలిపారు. రైతుల పెట్టుబడి సాయంపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు. గ్రూప్ వన్, గ్రూప్ టూ ఉగ్యోగాల భర్తీపై చర్చించామని, త్వరలో తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాబోయే ఐదేండ్లలో ప్రజలు కోరుకునే మార్పును చూపిస్తామ న్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. మంత్రుల శాఖల కేటాయింపుపై విలేఖర్లు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ అదంతా సీఎం చూసుకుంటారని దాట వేశారు.

# సీఎం రేవంత్‌కు ప్రధాని శుభాకాంక్షలు









న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డికి, కొలువుతీరిన కొత్త ప్రభుత్వానికి ప్రధాని మోదీ, ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం స్టాలిన్, పలువురు తెలంగాణ రాష్ట్ర నేతలు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రగతికి, పౌరుల సంక్షేమానికి అన్ని విధాలా తోడ్పాటు అందిస్తానని మోదీ గురువారం 'ఎక్స్' (ట్విటర్) వేదికగా తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సోదరభావం, సహకారం పరిఢవిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని జగన్ 'ఎక్స్' ద్వారా తెలిపారు. రేవంత్ తెలంగాణ ముఖ్యమంత్రిగా విజయవంతం కావాలని, ప్రజలకు విశేష సేవలందించాలని చంద్రబాబు ఆకాంక్షించారు. రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపినట్టు స్టాలిన్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి మండలికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. వారిలో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టీ హరీశ్‌రావు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కంభంపాటి రామ్మోహన్‌రావు ఉన్నారు. హామీల అమలు దిశగా ప్రభుత్వం పనిచేయాలని హరీశ్‌రావు ఆకాంక్షించారు.

ప్రగతి భవన్ పేరును సామాజిక సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే భవన్‌గా మార్చడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి రేవంత్‌రెడ్డిని గురువారం సచివాలయంలో కలిసి అభినందించారు.

## ఎంపీపీగా ప్రస్థానం ప్రారంభించి..



దాదాపు 28 సంవత్సరాల క్రితం ఎంపీపీగా ప్రస్థానాన్ని ప్రారం భించి.. ఈ క్రమంలో ఎదురైన ఎన్నో అడ్డంకులు, అవాం తరాలను దాటుకుని ముందుకు సాగిన ఫైర్ బ్రాండ్ నేత.. కొండా సురేఖ. తుమ్మ రాధ, చంద్రమౌళి దంపతులకు జన్మించిన ఆమె.. బీకాం దాకా చదివారు. కాలేజీలో చదువుతున్న రోజుల్లోనే.. కొండా మురళీధర్ రావును ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. 1995లో గీసుగొండ మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. 1996లో పీసీసీ సభ్యురాలయ్యారు. 1999లో శాయంపేట ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. 1999లోనే సీఎల్పీ కోశాధికారిగా పార్టీ ఆమెకు పదవినిచ్చింది. అలాగే.. 1999లో మహిళా శిశు సంక్షేమ కమిటీ సభ్యురాలిగా, ప్రాథమిక ఆరోగ్య, విద్య, స్థాయీ సంఘం సభ్యురాలిగా పనిచేశారు. 2000లో ఏఐసీసీ సభ్యురాలిగా అవకాశం అందిపుచ్చుకున్నారు. 2004లో ఏఐసీసీ కో ఆప్టెడ్ మెంబర్‌గా పని చేశారు. 2004లోనే పబ్లిక్ అండర్ టేకింగ్ సభ్యురాలిగా పనిచేశారు. అదే సమయంలో మరోసారి ప్రాథమిక ఆరోగ్యం, విద్య, స్థాయీసంఘం సభ్యురాలిగా పనిచేశారు. 2004లో పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేశారు. 2005లో వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా వ్యవహరించారు. 2009లో పరకాల ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొంది.. మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. 2009లో వరంగల్ జిల్లా పరిషత్ 4వ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా ఉన్నారు. 2014లో టీఆర్ఎస్ పార్టీ నుంచి వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018లో పరకాలలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తాజాగా వరంగల్ తూర్పు నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొంది మంత్రిగా ప్రమాణం చేశారు.

### నాలుగో సీఎం వద్ద మంత్రిగా..



ఓ సామాన్య రైతు కుంటుంబంలో పుట్టి.. రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగి తనదంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నాయకుడు తుమ్మల నాగేశ్వరరావు. అటు ఉమ్మడి రాష్ట్రంలోనూ, ఇటు స్వరాష్ట్రంలోనూ కలిపి.. నలుగురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రి అయిన ఘనత ఆయనది. తన 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవంలో.. ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్ మంత్రి వర్గాల్లో సుమారు 17 ఏళ్లపాటు మంత్రిగా పనిచేశారు. తాజాగా మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వంలో, రేవంత్‌రెడ్డి సారథ్యంలోని మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ హయాంలో మూడుసార్లు, తెలంగాణ ఆవిర్భావం తర్వాత కేసీఆర్ సార?థ్యంలోని టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్కసారి, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో.. మంత్రి అయ్యారు. రైతుబిడ్డగా, అభివృద్ధి విజన్ ఉన్న నేతగా పేరొందిన తుమ్మల.. ఉమ్మడి ఖమ్మంజిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. డిగ్రీ వరకుచదివి వ్యవసాయం వృత్తిగా ఎంచుకున్నారు. 'తెలుగుదేశం పిలుస్తోంది.. రా కదలిరా' అన్న ఎన్టీఆర్ పిలుపుతో 1982లో టీడీపీలో చేరి అంచలంచెలుగా ఎదిగారు. నాటి నుంచి పదకొండుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి ఆరుసార్లు విజయం సాధించారు. ఐదుసార్లు ఓటమి పాలయినా ఆయనకున్న అనుభవమే అవకాశాలను తెచ్చిపెట్టింది. ఉమ్మడి రాష్ట్రంలో చిన్ననీటిపారుదల, ఎక్సైజ్, భారీ నీటి పారుదల, రోడ్లుభవనాల శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన.. 2014లో ఖమ్మం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత కేసీఆర్ ఆహ్వానం మేరకు టీఆర్ఎసలో చేరి, ఆయన క్యాబినెట్‌లో రోడ్లుభవనాలశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఆతర్వాత ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2016లో పాలేరు ఉపఎన్నికల్లో పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018లో ఓటమి తర్వాత టీఆర్ఎసలోనే కొనసాగిన ఆయన.. ఈ ఎన్నికల్లో తనకు పాలేరు అభ్యర్థిత్వం దక్కుతుందని భావించారు. కానీ కేసీఆర్ టికెట్ ఇవ్వరని తేలడంతో కాంగ్రెస్ పార్టీలో చేరి ఖమ్మం అభ్యర్థిగా టికెట్ సాధించి, గెలిచి, మంత్రి పదవి చేపట్టారు.

### ప్రొపల్షన్ మాడ్యూల్ ని విజయవంతంగా మళ్లీ భూ కక్ష్యలోకి..

(మొదటిపేజీ తరువాయి)

రికార్డు మరింత లోతుగా ప్రయోగాలు చేయడానికి ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. జాబిల్లిపై నమూనాలు సేకరించి అక్కడ నుంచి తిరిగి వచ్చే మిషన్ కోసం ప్రణాళికలు రూపొందించేందుకు ప్రొపల్షన్ మాడ్యూల్లోని అదనపు సమాచారం ఉపయోగపడుతుందని చెబుతున్నారు.ఈ ఏడాది జులై 14న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి చంద్రయాన్-3 మిషన్‌ను ఇస్రో ప్రయోగించింది. అది విజయవంతం కావడంతో ప్రొపల్షన్ మాడ్యుల్, ల్యాండింగ్ మాడ్యుల్ వేరయ్యాయి. ఆగస్టు 23న జాబిల్లిపై ల్యాండర్ విజయవంతంగా దిగింది. ల్యాండింగ్ మాడ్యుల్‌లోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ అక్కడ 15 రోజులు పరిశోధనలు కొనసాగించి తరువాత నిద్రాణ స్థితిలోకి చేరుకున్నాయి రికార్డు మరింత లోతుగా ప్రయోగాలు చేయడానికి ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. జాబిల్లిపై నమూనాలు సేకరించి అక్కడ నుంచి తిరిగి వచ్చే మిషన్ కోసం ప్రణాళికలు రూపొందించేందుకు ప్రొపల్షన్ మాడ్యూల్లోని అదనపు సమాచారం ఉపయోగపడుతుందని చెబుతున్నారు.ఈ ఏడాది జులై 14న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి చంద్రయాన్-3 మిషన్‌ను ఇస్రో ప్రయోగించింది.

# రేవంత్‌కు కొండంత బలం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులుగా ప్రమాణం చేసిన పదకొండు మందిలో ఎవరి విశిష్టత వారిదే!**

### ఓటమి ఎరుగని నేత



ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత.. ఓటమి ఎరుగని నాయకుడు.. మల్లు భట్టి విక్రమార్క! హైదరాబాద్ సెంట్రల్ యూని వర్సిటీలో చదువుకొనే రోజుల్లో ఐఏఎస్ కావాలని కలలుకన్న భట్టి.. అనంతరకాలంలో తన సోదరుడు దివంగత నేత మల్లు అనంతరాములు స్ఫూర్తితో విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి వచ్చారు. కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. 1994 నాటికి ఆంధ్రా బ్యాంకు డైరెక్టర్‌గా ఉన్న ఆయన మధిర ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ప్రయత్నించినా అవకాశం రాలేదు. 2000 సంవత్సరంలో పీసీసీ కార్యదర్శి.. 2007లో స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ అయ్యారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో మధిర ఎస్సీలకు రిజర్వ్ అయ్యింది. దీంతో ఆ ఏడాది ఆయన మధిర నుంచి పోటీ చేసి.. కమ్యూనిస్టుల కంచుకోటను బద్దలుగొట్టారు. మధిర నుంచి కాంగ్రెస్ శాసనసభ్యుడిగా వరుసగా నాలుగుసార్లు గెలుపొందారు. 2009 నుంచి రెండేళ్లపాటు చీఫ్ విప్‌గా.. 2011-2014 నడుమ డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. రాష్ట్ర విభజన ప్రక్రియలో డిప్యూటీ స్పీకర్‌గా శాసనసభలో భట్టి కీలకపాత్ర పోషించారు. 2014 మ్యానిఫెస్టో కమిటీ కో కన్వీనర్‌గా, 2015లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పదవులు చేపట్టారు. 2009 తర్వాత.. 2014, 2018 ఎన్నికల్లోనూ గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 2014లో కాంగ్రెస్ శాసనసభాపక్ష ఉపనేతగా.. 2018లో కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా వ్యవహరించారు. శాసనసభపక్ష నేతగా.. 'పీపుల్స్ మార్చ్' పేరుతో అదిలాబాద్ జిల్లా నుంచి ఖమ్మంవరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మరోసారి గెలిచి.. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వంలో.. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

### పైలట్‌గా నుంచి రాజకీయాల్లోకి..



రక్షణ రంగం నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి అంచెలంచెలుగా ఎదిగిన నేత.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి. నేషనల్ డిఫెన్స్ అకాడమీలో బీఎస్సీ చేసిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి.. సియాచిన్, ఇతర ఆపరేషన్ల కోసం నిర్దేశించిన యుద్ధ విమానాల్లో ఫ్రంట్ లైన్ ఫైటర్ స్క్వాడ్రన్‌లో పైలట్‌గా సేవలందించారు. పాకిస్థాన్, చైనా సరిహద్దు ప్రాంతాల్లో వాయుసేనలో పనిచేశారు. ఉత్తమ్ స్వగ్రామం.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తిరుమలగిరి మండలం తాటిపాముల. ఆయన తండ్రి పురుషోత్తమ్ రెడ్డి బీహెచ్‌ఈఎల్‌లో ఉన్నత ఉద్యోగిగా పనిచేశారు. తల్లి ఉషాదేవి గృహిణి. రాజకీయాల్లోకి రావాలన్న ఆకాంక్షను జాతీయ కాంగ్రెస్ నాయకుల వద్ద వెల్లడించి వారి సూచన మేరకు 1994లో ఉద్యోగానికి రాజీనామా చేశారు. వెంటనే కోదాడ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందారు. మళ్లీ 1999, 2004 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2009, 2014, 2018, 2023 సంవత్సరాల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించి.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఎంపీగా ఉంటూనే 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొంది ఇప్పుడు మంత్రి అయ్యారు. ఉత్తమ్ సతీమణి.. ప్రస్తుత కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి. కాగా.. ఉత్తమ్‌కుమార్ రెడ్డి 2012లో కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో గృహనిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. తన రాజకీయ జీవితం మొత్తం గాంధీ కుటుంబానికి అత్యంత విధేయుడిగా ఉన్నారు.

### 29 ఏళ్ల వయసులో ఎమ్మెల్యే



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా వ్యవహరించిన దుద్దిళ్ల శ్రీపాదరావు కు మారుడు.. న్యాయ శాస్త్రంలో బ్యాచిలర్స్, రాజనీతి శాస్త్రంలో మాస్టర్స్ పట్టా పొంది రాజకీయాల్లోకి ప్రవేశించి 29 ఏళ్ల వయసులో ఎమ్మెల్యే అయి రికార్డు సృష్టించిన నాయకుడు.. దుద్దిళ్ల శ్రీధర్ బాబు. 1969లో జన్మించి.. ఉన్నత చదువులు చదివిన ఆయన 1998లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాద వృత్తి చేపట్టారు. తన తండ్రి హత్య అనంతరం రాజకీయరంగ ప్రవేశం చేశారు. 1999లో మంథని నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత.. 2004, 2009 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 2014లో ఓటమిపాలైనా.. మళ్లీ 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు శాఖల మంత్రిగా, ప్రభుత్వ విప్‌గా, ప్యానల్ స్పీకర్‌గా, టీటీడీ మెంబర్‌గా, తెలంగాణ కాంగ్రెస్ మ్యానిఫెస్టో మెంబర్‌గా పని చేశారు. ప్రస్తుత ం టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా, ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా కొనసాగారు. మళ్లీ ఇప్పుడు రేవంత్ నేతృత్వంలో కొలువుదీరిన కొత్త క్యాబినెట్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

### కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఆరుసార్లు గెలుపొందిన నాయకుడాయన...



సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత జూపల్లి కృష్ణారావు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఆరుసార్లు గెలుపొందిన నాయకుడాయన. ప్రస్తుత వనపర్తి జిల్లాలో ఉన్న చిన్నంబావి మండలం పెద్దదగడ గ్రామంలో జూపల్లి శేషగిరిరావు, రత్నమ్మ దంపతులకు 1955లో జూపల్లి జన్మించారు. ఆయన తండ్రి వ్యవసాయం చేసేవారు. 1981లో ఆయన పెద్దదగడ గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పట్నుంచీ పరోక్షంగా రాజకీయాల్లో ఉన్న జూపల్లి.. బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసి 1999లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ఆ ఏడాది.. కొల్లాపూర్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. మళ్లీ 2004లో స్వతంత్ర అభ్యర్థిగా.. 2009లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. తెలంగాణ ఉద్యమ సమయంలో హస్తం పార్టీకి రాజీనామా చేసి 2012 ఉప ఎన్నికల్లో గెలుపొందారు. 2014లో టీఆర్ఎస్ నుంచి గెలుపొందారు. మళ్లీ 2023లో గెలుపొందారు. వైఎస్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి క్యాబినెట్‌లలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2011 మార్చిలో మంత్రి పదవికి రాజీనామా చేశారు. అదే ఏడాది టీఆర్ఎస్ (నేటి బీఆర్ఎస)లో చేరారు. 2014లో గెలిచాక.. కేసీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా వ్యవహరించారు. ఈసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలిచి, మంత్రి అయ్యారు.

### సాధారణ రైతు కుటుంబంలో నుంచి...



వ్యవసాయంతో మొదలుపెట్టి.. కాంట్రాక్టర్‌గా మారి.. ఆపై, రాజకీయాల్లోకి అడుగుపెట్టి అంచెలంచెలుగా ఎదిగి మంత్రి పదవి చేపట్టిన నేత.. పొంగులేటి శ్రీనివాసరెడ్డి. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మండలం నారాయణపురంలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన పొంగులేటి తొలుత వ్యవసాయం చేశారు. ఆ తర్వాత చిన్నచిన్న కాంట్రాక్టు పనులు నిర్వ హించి.. మంచితనమే పెట్టు బడిగా ఎదిగి క్లాస్ వన్ కాంట్రాక్టర్ అయ్యారు. వైఎసరాజశేఖరరెడ్డి అభిమానిగా 2013 ఫిబ్రవరి 23న వైసీపీలో చేరారు. ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డితో ఉన్న సత్సంబంధాలతో ఖమ్మం లోక్‌సభ టికెట్ సాధించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీచేయకపోవడం, సీపీఎం మద్దతు ఇవ్వడం పొంగులేటికి కలిసి వచ్చింది. దీంతో ఖమ్మం ఎంపీగా గెలుపొందిన పొంగులేటి.. రాష్ట్ర విభజన తర్వాత కొంతకాలం వైసీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఆతర్వాత టీఆర్ఎసలో చేరారు. అయితే.. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పొంగులేటికి కేసీఆర్ టికెట్ ఇవ్వలేదు. రాజ్యసభకు పంపుతామని హామీ ఇచ్చారు. కానీ, ఎంత ఎదురుచూసినా ఆ దిశగా అధినాయకత్వం నుంచి ఎలాంటి సంకేతాలు రాకపోవడంతో బీఆర్ఎసకు దూరంగా ఉంటూ వచ్చారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్ ఇచ్చే విషయంపై కూడా గ్యారంటీ ఇవ్వకపోవడంతో 2023 జనవరి 1న బీఆర్ఎసపై తిరుగుబాటు ప్రకటించి.. ఏప్రిల్ 10న పార్టీకి రాజీనామా చేశారు. జూలై మొదట్లో కాంగ్రెసలో చేరారు. పార్టీ ప్రచార కమిటీ కో కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ ఎన్నికల్లో పాలేరు అభ్యర్థిగా బరిలోకి దిగి భారీ మెజారిటీతో విజయం సాధించి రేవంత్ క్యాబినెట్‌లో మంత్రి అయ్యారు.

### సివిల్ ఇంజనీరింగ్ చదివి..



సివిల్ ఇంజనీరింగ్ చదివి.. సివిల్స్‌లో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పెట్టుకుని ప్రిలిమ్స్‌లో పాసైనా.. తన తండ్రి, దివంగత సిలారపు రాజనర్సింహ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన నేత.. దామోదర రాజనర్సింహ. కాంగ్రెస్ పాతకాపు. 1989లో ఎమ్మెల్యేగా గెలుపొంది అప్పట్నుంచీ పార్టీని అంటిపెట్టుకుని ఉండి, రెండుసార్లు మంత్రిగా వ్యవహరించిన సీనియర్ నాయకుడు. 1958 డిసెంబరు 5న హైదరాబాద్‌లో జానాబాయి, రాజనర్సింహ దంపతులకు జన్మించిన దామోదర రాజనర్సింహ.. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రాథమిక, ఉన్నతవిద్యను అభ్యసించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి బీఈ సివిల్ చేశారు. ఆయనకు భార్య పద్మినీరెడ్డి, కుమార్తె త్రిష ఉన్నారు. ఆయన తండ్రి సిలారపు రాజనర్సింహ 1967, 1972, 1977లో అందోలు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన మరణానంతరం.. దామోదర రాజనర్సింహ 1989 ఎన్నికల్లో అందోలు నుంచే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అప్పట్లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా కూడా పనిచేశారు. ఆ తర్వాత 1994, 1999 ఎన్నికల్లో ఓటమిని చవి చూశారు. 2004 ఎన్నికల్లో గెలిచిన ఆయన.. వైఎస్ క్యాబినెట్‌లో ప్రాథమిక విద్యా మంత్రిత్వ శాఖ బాధ్యతలు నిర్వర్తించారు. 2009 ఎన్నికల్లోనూ గెలిచి వైఎస్ మంత్రి వర్గంలో మార్కెటింగ్ శాఖను, రోశయ్య క్యాబినెట్‌లో ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖను నిర్వహించారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో ఉన్నత విద్య మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2014, 2018 ఎన్నికల్లో మళ్లీ ఓడిన దామోదర.. ఈసారి అందోల్ నుంచే గెలిచి రేవంత్ క్యాబినెట్‌లో మంత్రి అయ్యారు.

### విద్యార్థి రాజకీయాల నుంచి మంత్రి స్థాయికి..



విద్యార్థి సంఘ నాయకుడిగా రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టి.. రాష్ట్ర మంత్రి స్థాయికి ఎదిగిన నేత.. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌గౌడ్. ఓ సాధా రణ వ్యవ సాయ కుటుంబం నుంచి వచ్చిన పొన్నం.. ఎంఏ, ఎల్ఎల్‌బీ చదివారు. రాజకీయ ఒడుదొడుకులు ఎన్ని ఎదురైనా.. కాంగ్రెస్ పార్టీని వీడకుండా విధేయుడిగా ఉండడమే ఆయనకు మంత్రి పదవి దక్కేలా చేసింది. డిగ్రీ చదువుతున్న కాలంలోనే కరీంనగర్ ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నియ్యారు. కాంగ్రెస్ విద్యార్థి విభాగం నుంచి మొదలుపెట్టి.. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. 1999 నుంచి 2002 వరకు ఏపీ ఎన్ఎసయూఐ ప్రెసి డెంట్‌గా.. 1992 నుంచి 1998 వరకు ఎన్ఎసయూఐ కరీంనగర్ జిల్లా అధ్యక్షునిగా, ఎన్ఎసయూఐ రాష్ట్ర కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. టీపీసీసీ శిక్షణ కమిటీ చైర్మన్‌గా, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూడా పని చేశారు. 2009లో కరీంనగర్ ఎంపీగా ఎన్నికై తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన సందర్భంగా లగడపాటి రాజగోపాల్ జరిపిన పెప్పర్ స్ప్రే దాడితో పొన్నం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. కరీంనగర్ నుంచి 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. వైఎసఅనుచరుడిగా పేరున్న పొన్నం ప్రభాకర్.. 2005 నుంచి 2009 వరకు ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పని చేశారు. 2009 నుంచి 2014 వరకు కరీంనగర్ ఎంపీగా, కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్‌గా ఉన్నారు. 2014, 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి చెందారు. కరీంనగర్ నుంచి రెండుమార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందిన పొన్నం ప్రభాకర్.. మూడవసారి హుస్నాబాద్ నుంచి బరిలోకి దిగి విజయం సాదించి, మాజీ సీఎం కేసీఆర్ సెంటిమెంట్‌ను దెబ్బ కొట్టారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి మంత్రి పదవి రావడం కూడా ఇదే మొదటిసారి.

## సంపాదకీయం

# కలకలం రేపుతున్న శర్మిష్ట బుక్



ప్రణబ్ ముఖర్జీ జీవితంపై ఆయన కూతురు శర్మిష్ఠ రాసిన పుస్తకం జాతీయ రాజకీయాల్లో దుమారం రేపుతోంది. తాను ప్రధాని కాకుండా సోనియాగాంధీ అడ్డుపడ్డినట్లు ప్రణబ్ ముఖర్జీ తనతో చెప్పారని షర్మిష్ఠ ఈ పుస్తకంలో రాశారు. పదవినే ఆశించనపుడు, అసంతృప్తే ఉండదని తన తండ్రి చెప్పినట్లు షర్మిష్ట రాశారు.. అలాగే రాహుల్‌గాంధీ రాజకీయంగా పరిణతి చెందలేదనీ, ఆయన పార్లమెంటుకు రెగ్యులర్‌గా రాకపోవడంపై తన తండ్రికి నచ్చకపోయేదన్నారు. దివంగత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, తన తండ్రికి గురించిన విషయాలతో ఆయన కూతురు శర్మిష్ట ముఖర్జీ పుస్తకం రాశారు. ప్రణబ్ డైరీ, ఆయన తనతో చెప్పిన విషయాల ఆధారంగా శర్మిష్ట ముఖర్జీ 'ఇన్ ప్రణబ్, మై ఫాదర్: ఏ డాటర్ రిమెంబర్స్' బుక్‌లో కీలక విషయాలు వెల్లడించారు. ఈ పుస్తకంలోని విషయాలు ప్రస్తుతం సంచలనంగా మారుతోంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ గురించి తన తండ్రికి ఉన్న అభిప్రాయాలను పంచుకున్నారు. రాహుల్ గాంధీకి నెహ్రూ-గాంధీ అహంకారం వచ్చినప్పటికీ, వారి రాజకీయ చతురత రాలేదని పేర్కొన్నట్లు ప్రణబ్ కూతురు వెల్లడించారు. ఆయనకు రాజకీయ పరిపక్వత లేదని డైరీలో రాసుకున్నట్లు ఆమె తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ గురించి శర్మిష్ట ముఖర్జీ సంచలన విషయాలు వెల్లడించారు. ప్రణబ్ ముఖర్జీకి, మోడీకి ఉన్న సంబంధాల గురించి వెల్లడించారు. ప్రధాని మోడీతో, ప్రణబ్ ముఖర్జీకి విచిత్రమై సంబంధం ఉందని, మోడీ ఎప్పుడూ ప్రణబ్ ముఖర్జీ కాళ్లకు నిజాయితీతో నమస్కరించేవారని చెప్పారు. ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతిగా ఎన్నికైన సందర్భంలో తన విధులు, బాధ్యతల గురించి స్పష్టంగా ఉండేవారని, మోడీ, తన తండ్రి వేర్వేరు సిద్ధాంతాలకు చెందిన వారైనప్పటికీ, పాలనలో తాను జోక్యం చేసుకోనని చెప్పినట్లు ఆమె వెల్లడించారు. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రి కాకముందు నుంచి వీరిద్దరి మధ్య సంబంధం ఉండేదని ఆమె తెలిపారు. ప్రధాని మోడీ అప్పుడు ఒక సాధారణ పార్టీ కార్యకర్తగా వివిధ కార్యకలాపాల కోసం ఢిల్లీకి వచ్చేవాడినని, ఉదయం ప్రణబ్ ముఖర్జీ మార్నింగ్ వాక్ వెళ్లే సమయంలో కలిసే వాడినని, తాను ఎల్లప్పుడు ప్రణమ్ పాదాలకు నమస్కరించేవాడిని" అని ప్రధాని మోడీ చెప్పారని శర్మిష్ట అన్నారు. ప్రణబ్ డైరీలో ఇది ఓ ఆసక్తికరమైన విషయమని అనుకున్నానని చెప్పారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోడీ ఉన్న సమయంలో రాష్ట్రపతిని కలిసేందుకు వచ్చినప్పుడు ప్రణబ్ ముఖర్జీ కీలక విషయాన్ని వెల్లడించారు. ' అతను కాంగ్రెస్ ప్రభుత్వం, దాని విధానాలపై తీవ్ర విమర్శకుడు, కానీ వ్యక్తిగతంగా ఎప్పుడూ నా పాదాలను తాకుతాడు, ఇది తనకు ఆనందాన్ని ఇస్తుంది, ఎందుకో నాకు అర్థం కాదు' అని ప్రణబ్ ముఖర్జీ రాశారని శర్మిష్ట చెప్పారు. రాష్ట్రపతి, ప్రధాన మంత్రి సంబంధాలు కేవలం వ్యక్తిగత సంబంధంపై నిర్మించబడలేదని, రాష్ట్రపతిగా ఎన్నికైన ప్రభుత్వంలో జోక్యం చేసుకోకుండా ఉండాల్సిన బాధ్యత కూడా తనపై ఉందని ప్రణబ్ విశ్వసించారని ఆయన కూతురు తెలిపారు. ప్రజలు మీకు అధికారం ఇచ్చారని, మీ పాలనలో జోక్యం చేసుకోనని, కానీ ఏదైనా రాజ్యాంగపరమైన విషయంలో సాయం కావాలంటే నేను ఉంటానని ప్రణబ్ చెప్పినట్లు మోడీ తనతో వెల్లడించారని శర్మిష్ట తెలిపారు. 2009 సార్వత్రిక ఎన్నికల ముందు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తాను సంకీర్ణ ప్రభుత్వానికి అనుకూలం కాదని చెప్పిన ఘటనను తన తండ్రి డైరీలో పేర్కొన్నారని ఆమె వెల్లడించారు. 2004-2014 వరకు ప్రణబ్, రాహుల్ గాంధీల మధ్య పెద్దగా కలుసుకోలేదని వెల్లడించారు. "రాహుల్ చాలా మర్యాదగా ప్రవర్తిస్తారు, అనేక ప్రశ్నలు అడుగుతారు, కానీ రాజకీయాల్లో ఆయన పరిణతి సాధించలేదు, 2013 జూలైలో ఓసారి మా ఇంటికి వస్తే ముందుగా కేబినెట్‌లో చేరి అనుభవం తెచ్చుకోవాలని చెప్పానని, అయితే ఆయన నా సలహాను వినిపించుకోలేదు." అని ప్రణబ్ డైరీలో రాసుకున్నారు. రాహుల్ గాంధీ రాజకీయ భవిష్యత్తు గురించి ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ వంటి దోషులను కాపాడేందుకు 2013లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ని కాంగ్రెస్ అధినేతగా ఉన్న రాహుల్ గాంధీ చింపేసి చెత్తబుట్టలో పడేసిన తీరుపై ప్రణబ్ ముఖర్జీ కలత చెందినట్లు శర్మిష్ట ముఖర్జీ అన్నారు. రాహుల్ గాంధీ రాజకీయంగా పరిపక్వతతో లేరని తన తండ్రి చెప్పినట్లు వెల్లడించారు. అతను అవగాహన లేకుండా ఉన్నారని ప్రణబ్ భావించారని ఆమె తెలిపారు. గాంధీ-నెహ్రూల అహంకారమంతా రాహుల్ గాంధీకి వచ్చింది, కానీ వారి రాజకీయ చతురతే ఆయనకు అబ్బలేదని డైరీలో రాసుకున్నారని పుస్తకంలో పేర్కొన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరపరాజయం తర్వాత రాహుల్ గాంధీ తరుచుగా పార్లమెంట్‌కి గైర్హాజరు కావడం పట్ల ప్రణబ్ ముఖర్జీ అసంతృప్తితో ఉండేవారని శర్మిష్ట తెలిపారు. సోనియాగాంధీని ప్రధాని చేయాలనే ఆశలు తనకు లేవని ప్రణబ్ ఓ జర్నలిస్టుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారని ఆమె చెప్పారు. 2004లో సోనియాగాంధీ ప్రధాని పీఠం వద్దన్న తర్వాత తన తండ్రి ప్రణబ్‌తో పాటు మన్మోహన్ సింగ్ పేర్లు వినిపించాయని, ప్రధాని మంత్రి పదవి వద్దని, మన్మోహన్ సింగ్ ప్రధాని అవుతారని తనకు చెప్పినట్లు తన తండ్రి చెప్పినట్లు శర్మిష్ట తెలిపారు.

# నేర విచారణ మరింత సమర్ధవంతంగా ఉండాలి

## జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్




**జగిత్యాల- ప్రభాత సూర్యుడు :** నేర విచారణ మరింత సమర్ధవంతంగా ఉండాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆన్నారు... గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో పోలీస్ స్టేషన్లు పనితీరుపై, నమోదైన కేసుల పై సమీక్ష సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పనితీరును, కేసుల చేదనలో సాధించిన పురోగతిని అంచనా వేసుకుంటూ మరింత దృఢ నిశ్చయతో పనిచేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. డిఎస్పి లు, సి.ఐ లు తమ పరిధిలో ఉండే పోలీస్ స్టేషన్ లలో నమోదైన వివిధ రకాల కేసులు యొక్క స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత ఎస్.ఐలకు కేసుల దర్యాప్తు కు సంభందించి సూచనలు ఇవ్వాలని సూచించారు. పోలీస్ స్టేషన్ కి వచ్చే ప్రతి ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే దిశగా కృషి చేసి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న కేసులలో త్వరగా పరిశోధన పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలి అని పెండింగ్ కేసులలో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి, కేసులు ఛేదించాలని సూచించారు. ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలు పరచడానికి అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలు అయిన గంజాయి, మట్కా, ఇసుక అక్రమ రవాణా, పేకాట, గుడుంబా, పీడీఎస్ రైస్, వాటి పై నిఘా ఉంచి దాడులు నిర్వహించి అరెస్ట్ చేయాలని సూచించారు. మెగా లోక్ అదాలత్ దృష్ట్యా పోలీస్ అధికారులు కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రభాకర్ రావు, భీమ్ రావు, డిఎస్పీ రంగ రెడ్డి,ఎస్బీ, రాజా రెడ్డి పాల్గోన్నారు.

# బాలోత్సవం..సృజనోత్సవం

## - పిల్లల ప్రపంచంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



సుందరయ్య విజ్ఞాన కేంద్రం పిల్లల ప్రపంచంగా మారింది. ఇరుకుగదులు..బట్టీ చదువులకు కాస్త విరామమిచ్చి స్వేచ్ఛా ప్రపంచంలో వేలాది మంది పిల్లలు విహరించారు. తమను చదువు అనే చట్రంలో బంధించకుండా స్వేచ్ఛనిస్తే..సృజనాత్మకతను ప్రోత్సహిస్తే బాలమేధావులుగా మరోప్రపంచాన్ని సృష్టిస్తామన్న ధీమాను చాటిచెప్పారు. వెయ్యి హోల్టుల బల్బు వెలిగిన మాదిరిగా తమ చైతన్యరూపాన్ని ముఖకవళికల్లో చూపెట్టారు. అందర్నీ ఆకట్టుకునేలా..ఆలోచింపజేసేలా ప్రదర్శనలిచ్చి ఔరా అనిపించారు. బాలోత్సవం ఆధ్వర్యంలో మూడో పిల్లల జాతర అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఎస్వీకేలో ప్రారంభమైంది. అది పిల్లల సృజనాత్మక కార్యక్రమాలకు వేదికైంది.

పిల్లలంతా తమలో దాగి ఉన్న శక్తిసామర్థ్యాలను బాలోత్సవం వేదిక సాక్షిగా ప్రదర్శించారు. 'చదువుల చట్రంలో బాల్యాన్ని బంధించకండి. ఇరుకు గదులు..బట్టీ చదువులకు పరిమితం చేయకండి. స్వేచ్ఛనివ్వండి. ఆడనివ్వండి. పాడనివ్వండి. ఆలోచించనివ్వండి. సృజనాత్మకతను ప్రోత్సహించండి. మరోప్రపంచంలో విహరించనివ్వండి' అన్నట్టుగా పిల్లలు తమ ప్రదర్శనలు ద్వారా ఆలోచింపజేశారు. బంకమట్టితో ఇండ్లు, చేదబాయి, పొయ్యి వద్ద వంటచేస్తున్న అమ్మ, పొలం పనిచేసే రైతన్న బొమ్మలు చేసి ఔరా అనిపించారు. చెత్తకాగితాలు, పనికి రాని ప్లాస్టిక్ డబ్బాలు, ఇతర వ్యర్థాలతో పిల్లలు పలు వస్తువులను తయారు చేశారు. దీపావళి సందర్భంగా కాల్చిపారేసిన భూ చక్రాల వ్యర్థాలతో ఓ అమ్మాయి తయారు చేసిన మోటార్ సైకిల్ బొమ్మ ఔరా అనిపించింది. ఐస్‌క్రీమ్ తినేసి పారేసిన పుల్లలతో ఓ అమ్మాయి గోడగడియారాన్ని అద్భుతంగా తయారు చేసింది. కొబ్బరిపీచుతో తయారు చేసిన పక్షిగూడు కూడా ఆకట్టుకున్నది.

శాస్త్రీయ భావజాలానికి నిలువుటద్దం సైన్స్‌ఫేర్

చిన్నపిల్లలు తయారు చేసిన పరికరాలతో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్ శాస్త్రీయ భావజాలానికి నిలువుటద్దంగా నిలిచింది. చదువులంటే చాందస్తం కాదు.. శాస్త్రీయ విజ్ఞానమని పిల్లలు తమ విజ్ఞాన ప్రదర్శనలతో నిరూపించారు. వర్షపు నీటిని నిల్వచేసుకుని ఇంటి అవసరాలకు, ఫిల్టర్ చేసి తాగేందుకు వాడుకునేలా ఏర్పాటు చేసిన ప్రదర్శన ప్రకృతి సంపదను ఎలా వాడుకోవాలనే ఆవశ్యకతను నొక్కిచెప్పింది. వాడిపారేసిన సిరంజీలు, సైలెన్ బాటిళ్ల పైపులతో విద్యార్థులు తయారు చేసిన జేసీబీ ఆకట్టుకున్నది. బయోడైవర్సిటీ పెంపొందించేలా కట్టిన ఇల్లు బొమ్మ పలువుర్ని ఆలోచింపజేసింది. ఇస్రో ద్వారా రాకెట్లను పైకి పంపే ప్రక్రియను చూపే ప్రదర్శన బాగుంది. ఇలా ఒక్కటేంటి అక్కడ ఏర్పాటు చేసిన ప్రతి ప్రదర్శనా దేనికదే ప్రత్యేకతను సాధించుకున్నది. నీటి కాలుష్యం ఏవిధంగా పెరుగుతున్నది? పర్యావరణాన్ని ఏవిధంగా కాపాడుకోవాలి? అనే అంశంపైనా విజ్ఞాన ప్రదర్శన చేశారు.

**సందడే సందడి..**

పిల్లల ఉరుకులు.. పరుగులు ముచ్చట్లు..కేరింతలు ఈలలతో సుందరయ్య విజ్ఞాన కేంద్రం పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. 'కులం వద్దు. మతం వద్దు. మానవత్వమే ముద్దు' అంటూ చిన్నారులు తమ ప్రదర్శనల్లో వ్యక్తపర్చారు. మొబైల్‌ఫోన్ మనుషుల జీవితాలను ఆగం చేస్తున్న తీరు కండ్లకు కట్టేలా నాటకాన్ని చిన్నారులు ప్రదర్శించారు. పర్యావరణాన్ని చేజేతులా ఎలా ధ్వంసం చేస్తున్నాం? ఎలా పరిరక్షించుకోవాలి? అనే అంశంపై చిన్నారి నాటక ప్రదర్శన ఆలోచింపజేసింది. పిల్లల పెంపకంలో ఆడ, మగ వివక్ష చూపొద్దని కోరుతూ ప్రదర్శించిన నాటిక తెలియకకుండానే తల్లిదండ్రులు చూపుతున్న వివక్షను ఎత్తిచూపింది. మనదేశంలో ఓవైపు ధనవంతుల పిల్లలు చదువుకుంటూ జీవితాన్ని ఎలా ఎంజాయ్ చేస్తున్నారు? అదే సమయంలో పేదల పిల్లలు చదువులకు దూరమై సమాజంలో ఎలా ఛీత్కారాలకు గురవుతున్నారనే అంశంపై చిన్నారి ప్రదర్శించిన నృత్యప్రదర్శన ఆకట్టుకున్నది. విద్యార్థులకు షార్ట్‌ఫిలిమ్స్ చూపెట్టి దాని నుంచి గ్రహించిన సారాన్ని పేపర్ ప్రజెంటేషన్ చేశారు. బతుకమ్మ, జానపద కళారూపాల ప్రదర్శనలతో ఎస్వీకే బయట సందడి వాతావరణం నెలకొంది. సుందరయ్యపార్కులో పిల్లలు దాండియా నృత్య ప్రదర్శనలు చేశారు. అందరూ అబ్బురపోయేలా శాస్త్రీయ, జానపద నృత్యప్రదర్శనలు ఇచ్చారు. రాణిరుద్రమదేవి, భగత్‌సింగ్, అల్లూరిసీతారామరాజు, ఇలా విచిత్ర వేషధారణలతో వచ్చిన విద్యార్థులు ఏకపాత్రాభినయ పాత్రతో పంచ్ డైలాగ్‌లను విసిరారు.

# జగిత్యాలలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు

**జగిత్యాల- ప్రభాత సూర్యుడు**

తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడాన్ని హర్షిస్తూ జగిత్యాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలుచేశారు. కాంగ్రెస్ నాయకులు తాటిపర్తి రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా భవన్ నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ జెండాలు పట్టుకొని, నినాదాలు చేస్తూ, తహసీల్ చౌరస్తా వరకు ర్యాలీగా తరలివెళ్లారు. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడంతో పాటు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, మంత్రులు ప్రమాణ స్వీకారం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్శ్రేణులుటపాసులు పేల్చి ,స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, నాయకులు బండ శంకర్, మన్సూర్ అలీ, నక్క జీవన్, పులి రాము,మున్నా, బొల్లిశేఖర్, గుంటి జగదీశ్వర్, దుర్గయ్య, ద్యావర శ్రీనివాస్, చిట్ల అంజన్న, గౌతమ్ రెడ్డి, మ్యాన మహేష్, నేహల్, బీరం రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215